# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 340

పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం

అక్టోబర్ 29, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కిన సీఎం



- ఆయన ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారు.
- సీఎంపై సిరికొండ మధుసూదనా చారి ఫైర్

8లో..

# వరద గుప్పిట్లో.. ఓరుగల్లు




- మొంథా తుఫాన్ బీభత్సం
- స్తంభించిన జనజీవనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు 'రెడ్ అలర్ట్'
- నగరంలో కుండపోత వర్షం

మొంథా తుఫాన్ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలు అల్లకల్లోలంగా మారాయి. వాతావరణ శాఖ వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షాల ధాటికి వరంగల్, హనుమకొండ నగరాల్లోని ప్రధాన రోడ్లు, కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునగగా, సాధారణ జనజీవనం పూర్తిగా స్తంభించింది. అత్యవసర పనులు మినహా ప్రజలు బయటకు రావడానికి సాహసించడం లేదు. స్కూళ్లకు సెలవు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుభారీ వర్షాల దృష్ట్యా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజలు, రైతులు, అధికారులను పూర్తి స్థాయిలో అప్రమత్తం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు. ప్రజల అత్యవసర సహాయార్థం జిల్లా యంత్రాంగం కంట్రోల్ రూమ్ నంబర్లను ఏర్పాటు చేశారు. – వరంగల్ వాయిస్, ఉమ్మడి వరంగల్ జిల్లా

వివరాలు 2,6లో..









## సైకిల్ రైడర్స్‌లో జోష్ నింపిన సీపీ

ఉల్లాసంగా సాగిన ర్యాలీ

8లో..



8లో..

## వరంగల్ అండర్ బ్రిడ్జి సమస్యలకు పరిష్కారం

- శాశ్వత మురుగు కాలువ నిర్మాణానికి చర్యలు
- మంత్రి కొండా సురేఖ ఆదేశం

## తానెక్కడున్న ధ్యాసంతా ప్రజల వైపే..

- పశ్చిమ ప్రజల క్షేమమే ముఖ్యం
- మొంథా తుఫాన్‌పై ఎమ్మెల్యే నాయిని



2లో..



# వరద గుప్పిట్లో ఓరుగల్లు

- మొంథా తుఫాన్ బీభత్సం
- భారీ వర్షం.. కలిగించేను నష్టం
- రోడ్లు, రైల్వేట్రాక్ ల పై చేరిన వర్షం నీరు
- ఆగిన రైళ్లు.. స్కూల్ బంద్
- డోర్నకల్ లో మహిళ మృతి

**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు డోర్నకల్ పట్టణం అతలాకుతలమైంది. ముఖ్యంగా డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో వరద నీరు భారీగా చేరి, గతంలో ఎన్నడూ లేని విధంగా రైల్వే ఏరియాలో, సుభాస్ వీధిలో ప్రవహించింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా స్టేషన్ సమీపంలోని కొర్లకుంట (మారమ్మకుంట), బ్రాహ్మణ కుంట (పీతురుకుంట) ఉద్ధృతంగా ప్రవహించి, రైల్వే స్టేషన్ దాటి పట్టణంలోకి వ్యాపించాయి. వరద పరిస్థితిపై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రత్యేక దృష్టి సారించారు. బుద్ధారం చెరువులోకి వరద నీటిని మళ్లించే పనులను పర్యవేక్షిస్తూ, రైల్వే అధికారులకు తగిన సూచనలు చేశారు. రైల్వే స్టేషన్‌లో నిలిచిన నీటిని తొలగించేందుకు రైల్వే, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, స్థానిక తహసీల్దార్ ఇమ్మానియేల్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, విద్యుత్ అధికారులు, పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, మైనార్టీ స్కూల్ వద్ద నీరు నిలవటంతో మున్సిపల్ సిబ్బందితో పాటు మైనార్టీ నాయకులు ఫరీద్ అక్కడికి చేరుకుని నీటిని తొలగించే ప్రయత్నం చేశారు.

### రైల్వే ట్రాక్‌పై నీరు..

డోర్నకల్ జంక్షన్ పరిధిలోని రైల్వే పట్టాలపై భారీగా వర్షపు నీరు చేరడంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. గుండ్రాతిమడుగు వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ స్టేషన్‌లో గోల్కొండ రైళ్లు నిలిచిపోయాయి. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన సీఐ రవికుమార్, చంద్రమౌళిలు ఎస్పీ ఆదేశాల మేరకు స్టేషన్లకు చేరుకుని ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. డోర్నకల్‌లో ఈ పరిస్థితికి కుంటల ఆక్రమణే ప్రధాన కారణం అని పట్టణ ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. అంబేద్కర్ నగర్ సమీపంలోని కొర్లకుంట, బ్రాహ్మణ కుంటల సమీపంలోని భూమి ఆక్రమణకు గురైందని, అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు వరద పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కుంటలను పరిరక్షించడంలో విఫలమయ్యారని మాజీ ఎంపీపీ దేవర వెంకన్న, బీజేపీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు రెహ్మాన్ వాపోయారు.

### నీటిలో జారిపడి మహిళ మృతి

వర్షపు నీటి బీభత్సంలో విషాదం చోటుచేసుకుంది. డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ శివారు సత్యతండాకు చెందిన రోషమ్మ అనే మహిళ బుధవారం వర్షం పడుతుండగా బట్టలు తీయడానికి బయటకు వెళ్లి తిరిగి ఇంట్లోకి వస్తుండగా, ఇంట్లో చేరిన వర్షపు నీటిలో జారిపడి అక్కడికక్కడే మృతి చెందింది

మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఏరులై పారుతున్నాయి. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ నగరాలు పూర్తిగా జలమయమయ్యాయి.గత రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల నేపథ్యంలో, నగరంలోని ప్రతి వాడ, కాలనీ నీట మునిగిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా మోకాలు లోతు వరద నీరు రోడ్లపై ఉధృతంగా పారుతోంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వరద కారణంగా హనుమకొండ బస్టాండ్ సమీపంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ట్రాఫిక్ జామ్‌లో అత్యవసరంగా వెళ్తున్న ఒక అంబులెన్స్ ఇరుక్కుపోయింది. రోడ్డుపై నీరు నిలవడంతో వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొనడంతో, అంబులెన్స్‌లో ఉన్న రోగి తీవ్ర ఇబ్బందిని ఎదుర్కోవాల్సి వచ్చింది. రెండు నగరాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.అన్ని విద్యాసంస్థలకు గురువారం రోజున సెలవు ప్రకటించారు.

### టోల్ ఫ్రీ/హెల్ప్‌లైన్ నంబర్లు

**హనుమకొండ కలెక్టరేట్ 7981975495, 18004251115**
**వరంగల్ జిల్లా కలెక్టరేట్1800 425 3424**
**జీడబ్ల్యూఎంసీ (GWMC)1800 425 1980, 9701999676**

## తానెక్కడున్న ధ్యాసంతా ప్రజల వైపే..

- పశ్చిమ ప్రజల క్షేమమే ముఖ్యం
- మొంథా తుఫాన్‌పై ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ జిల్లాల్లో వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తాను ఎక్కడున్నా ధ్యాసంతా పశ్చిమ ప్రజల క్షేమం మీదేనని ఆయన ప్రకటించారు. తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు ఫోన్ ద్వారా నియోజకవర్గంలోని అధికారులతో మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సిబ్బంది అందరూ ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి, అవసరమైన చోట సహాయక చర్యలు తీసుకునేందుకు తగు ఏర్పాట్లు చేయాలని, పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గాలులు, వాతావరణ మార్పులు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండటం అత్యంత అవసరం. అత్యవసరమైన పనులు తప్ప బయటకు వెళ్లకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. చలికాలం ప్రారంభమవుతున్న ఈ సమయంలో పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి నిల్వల దగ్గర, విద్యుత్ తీగల దగ్గర, పాత చెట్ల సమీపంలో వెళ్లకూడదు. అవసరమైతే స్థానిక అధికారులను సంప్రదించాలి. ప్రజలకు సహాయం అందించే విషయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక అధికారులకు, ప్రజలకు సహాయక చర్యలు అందేలా చూడాలని పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవాలని సూచించారు











# ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** మొంథా తుఫాన్ తీవ్రస్థాయిలో ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు, తీవ్ర గాలులు వీచే అవకాశం ఉన్నందున, ఎక్కడా ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలి. విద్యుత్, త్రాగునీరు సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలి. రోడ్లు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మత్తులు చేపట్టాలి.శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాలలో ఉన్నవారిని గుర్తించి, అవసరమైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా: ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే నాగరాజు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జాలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. అవసరమైతే పోలీసులకు లేదా అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా, సహాయం అవసరమైనా తన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' టోల్ ఫ్రీ నంబర్ 8096107107కి కాల్ చేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ఈ నంబర్‌కు కాల్ చేస్తే, తన వ్యక్తిగత సహాయక సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సహాయక చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### దామెర ఎస్సై అశోక్




**వరంగల్ వాయిస్, దామెర:** మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో, దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని ఎస్సై స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల వల్ల చెరువులు మత్తడి పోసే అవకాశం, వాగులు ఉధృతంగా పొంగే పరిస్థితులు ఉన్నందున, ప్రజలు మత్తడి, వాగులు దాటే ప్రయత్నం ఏ మాత్రం చేయవద్దని హెచ్చరించారు."రోడ్డుపై ప్రయాణించేటప్పుడు గుంతలను గమనించి జాగ్రత్తగా వెళ్లాలి. మీరు క్షేమంగా ఉండడమే మా లక్ష్యం. పోలీస్ వ్యవస్థ మీ కోసమే ఉంది," అని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ సహాయం కావాలన్నా వెంటనే డయల్ 100కి ఫోన్ చేయాలని ఎస్సై కొంక అశోక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మానవత్వం చాటుకున్న డ్రైవర్లు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తమ సహచర డ్రైవర్‌కు హనుమకొండలోని 'ఓన్ ప్లేట్ డ్రైవర్ మిత్ర బృందం' మానవత్వాన్ని చాటుకుంది. బాలసముద్రానికి చెందిన డ్రైవర్ రాళ్లబండి యకాంబరంచారికి ఈ బృందం తరపున రూ.19 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. పల్లెర్ల యాకుబ్ అధ్యక్షతన డ్రైవర్ల మిత్రబృందం కలిసి యకాంబరంచారికి ఈ మొత్తాన్ని అందజేసింది. కష్టకాలంలో తమ సహచర మిత్రుడికి అండగా నిలబడి, తమ గొప్ప మనసును చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పి.అశోక్, ఎం.మహేష్, వి.నవీన్, కృష్ణ, ఎస్.చిరంజీవి, ఎం.రమేష్, ఏ.రాజేందర్, సీహెచ్. రంజిత్, బి.విజయ్, డీజే.నరేష్, ఏ.గణేష్, కె.ప్రవీణ్, సురేష్, జి.పరశురాములు, ఎస్.విజయ్ కుమార్ డ్రైవర్ మిత్రులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రజలకు అత్యవసర సేవల నిమిత్తం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కంట్రోల్ రూమ్ ద్వారా సేవలను 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ నెంబర్ 798197549, టోల్ ఫ్రీ నెంబర్ 18004251115 5 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. వరదల కారణంగా అత్యవసర సేవల నిమిత్తం అందుబాటులో తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని ప్రజలను కోరారు.

## కూలర్ వైరు తగిలి చిన్నారి మృతి



**వరంగల్ వాయిస్, రేగొండ:** రేగొండ మండలం ఆర్జీ తండా గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న ఎయిర్ కూలర్ వైరు తగిలి మూడేళ్ల చిన్నారి విద్యుత్ షాక్‌కు గురై దుర్మరణం పాలైంది. గ్రామానికి చెందిన బానోతు వీరు, ప్రియాంకల కూతురు అంజలి (3) ఇంట్లో ఆడుకుంటోంది. ఈ క్రమంలో ఎయిర్ కూలర్‌కు చెందిన ఒక విద్యుత్ వైరు కరెంట్ బోర్డులో ఉండగా, మరొక వైరు తెగి కింద పడి ఉంది. ఈ విషయాన్ని గమనించని చిన్నారి ఆడుకుంటూ వెళ్లి కింద పడిన వైరును ముట్టుకుంది. దీంతో చిన్నారి అంజలికి ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలింది. ఇంట్లో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో, చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి మృతితో ఆర్జీ తండా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విద్యుత్ భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న ఇళ్లలో విద్యుత్ వైర్లు వారికి అందుబాటులో లేకుండా చూసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

## అప్రమత్తతే శ్రీరామ రక్ష

### సుబేదారి సీఐ రంజిత్ కుమార్




**వరంగల్ వాయిస్, సుబేదారి:** మొంథా తుఫాన్ తీవ్రత దృష్ట్యా, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ సూచించారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు భద్రతా సూచనలు చేశారు. "ఇప్పటికే ఊరు చెరువులు, కుంటలు నిండుకుండల్లా ఉన్నాయి. భారీ వర్షాల వల్ల చెరువులు మత్తడి పోసే అవకాశం, వాగులు ఉధృతంగా పొంగే పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి, ప్రజలు, వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తడి, వాగులు దాటే ప్రయత్నం చేయకూడదు," అని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు డ్రైనేజీలు, గుంతలను గమనించి జాగ్రత్తగా ప్రయాణించాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలి. వీలైనంత వరకు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి. పిల్లలను బయటకు రాకుండా చూడాలి. వర్షం పడేటప్పుడు ప్రజలు కరెంట్ స్తంభాలను తాకకూడదు. "ప్రజలు క్షేమంగా ఉండాలని, పోలీసులు ప్రజల కోసమే ఉన్నారని గుర్తుంచుకోవాలి. మీ రక్షణ మా బాధ్యత," అని ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం డయల్ 100కి ఫోన్ చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజల రక్షణే మా బాధ్యత

### కేయూ ఇన్ స్పెక్టర్ రవికుమార్




**వరంగల్ వాయిస్, కేయూ :** మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేయూ ఇన్ స్పెక్టర్ రవి కుమార్ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం కేయూ ఇన్ స్పెక్టర్ రవి కుమార్ ప్రజలకు పలు సూచనలు చేస్తూ... మొంథా తుపాన్ నేపథ్యంలో చెరువులు మత్తడి పొంగే అవకాశం ఉందని , వాగులు పొంగే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు, వాహన దారులు మత్తడి వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు. వాహనదారులు రోడ్డుపై వెళ్ళేటప్పుడు డ్రైనేజీ లు,గుంతలు గమనించాలని తెలిపారు.కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు క్షేమంగా ఉండాలని పోలీసులు ఉన్నది ప్రజల కోసమేనని గుర్తు చేశారు .ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని లేకుంటే ఇంటిలోనే ఉండాలని కోరారు. పిల్లలను బయటకు రాకుండా చూడాలని వర్షం పడేటప్పుడు ప్రజలు కరెంట్ స్తంభాలను తాకాకూడదన్నారు. మీ రక్షణ మా బాధ్యత అని అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కి ఫోన్ చేయాలని ఇన్స్పెక్టర్ రవి కుమార్ సూచించారు.


## పెద్దల సమాధుల పండగకు ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, పరకాల:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు, సీఎస్ఐ మిషన్ కాంపౌండ్‌లో ఉన్న సమాధుల తోటలో నవంబర్ 2న జరుగనున్న పెద్దల సమాధుల పండుగ కోసం ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ప్రతి ఏటా నిర్వహించే విధంగానే ఈ సంవత్సరం కూడా మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో సమాధుల తోటను శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ పెద్దల సమాధుల పండుగ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులందరూ ఇక్కడికి తరలివస్తారని తెలిపారు. వారు తమ పెద్దల సమాధులకు పెయింట్స్ వేసి, సున్నం పూసి అలంకరిస్తారని, అనంతరం సమాధులను దర్శించుకుని, నివాళులర్పించి, పూలమాలలు వేసి, క్యాండిల్స్ వెలిగించి తమ పెద్దలను స్మరించుకుంటారని చెప్పారు. ఈ పండుగ ద్వారా కుటుంబ సభ్యులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారని వివరించారు.

## అత్యవసరమైతనే బయటకు రావాలి

### హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్




**వరంగల్ వాయిస్,హనుమకొండ :** మొంథా తుపాన్ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఇన్ స్పెక్టర్ శివ కుమార్ ప్రజలకు పలు సూచనలు చేస్తూ మొంథా తుపాన్ నేపథ్యంలో చెరువులు మత్తడి పొసే అవకాశం, వాగులు పొంగే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు, వాహన దారులు మత్తడి వాగులు దాటే ప్రయత్నం చేయకండని సూచించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు డ్రైనేజీ లు,గుంతలు గమనించాలని తెలిపారు. ప్రజలు క్షేమంగా ఉండాలని పోలీసులు ఉన్నది ప్రజల కోసమేనని గుర్తు చేశారు .అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని లేకుంటే ఇళ్లల్లో ఉండాలని కోరారు. పిల్లలను బయటకు రాకుండా చూడాలని వర్షం పడేటప్పుడు ప్రజలు కరెంట్ స్తంభాలను తాకాకూడదని అన్నారు .మీ రక్షణ మా బాధ్యత అని అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కి ఫోన్ చేయాలని ఇన్ స్పెక్టర్ శివ కుమార్ సూచించారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి నివాళి

**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రవికుమార్ అనారోగ్యంతో మృతి చెందడంతో, గ్రామ కాంగ్రెస్ నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ నేతలు రవికుమార్ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందించారు.వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా తోడుంటుందని ఈ సందర్భంగా నాయకులు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గన్ను సరస్వతి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బొల్లం వేణుగోపాల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, రాజు, ఆదామ్, సంతోష్ స్వామి, రాంబాబు, సుధాకర్, ప్రేమ్ కుమార్, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖిలా వరంగల్‌లో కుండపోత వర్షం



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ నగరంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షంలో ఖిలా వరంగల్ ప్రాంతంలోని స్థానిక ప్రజలను రెవెన్యూ అధికారులు సందర్శించి, వారి బాగోగులను తెలుసుకున్నారు. స్థానిక ఎంఆర్ఓ ఇక్బాల్ ఆధ్వర్యంలో ఆర్ఐ కీర్తన్, జూనియర్ అసిస్టెంట్లు వంశీ, శివ, జీపీఓ సుభాష్‌లతో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. వర్షాల కారణంగా నీట మునిగిన అండర్ బ్రిడ్జి ప్రాంతంలోనూ, ఇతర లోతట్టు ప్రాంతాలలోనూ అధికారులు పర్యటించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు బయటికి రావద్దని సూచించారు. ప్రభుత్వం, అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రజలకు కావాల్సిన అవసరాలను తెలుసుకుని, వాటిని తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అధికారులు వాగులు, లోతట్టు ప్రాంతాలు, చెరువులను పర్యవేక్షించి, నీటి ప్రవాహ ఉధృతిని అంచనా వేశారు.

# అనవసర ప్రయాణాలు వద్దు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్:** రానున్న రెండు, మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు, రైతులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. ఎమ్మెల్యే శ్రీహరి బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ వర్షం సమయంలో చెట్ల కింద, పాడైన భవనాలు కింద లేదా శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదు. వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లవద్దు. ప్రజలు అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. ముంపు ప్రాంతాలు, వరద ప్రాంతాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గరలోని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.రైతులు పంటలు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోరాదని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. ప్రభుత్వ విభాగాలు, రక్షణ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 9052308621కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

# 'అధైర్య పడకండి... అండగా ఉంటాం'

## ఎంపీడీవో గుమ్మడి కల్పన



**వరంగల్ వాయిస్, దామెర:** మొంథా తుఫాను నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా హనుమకొండ జిల్లా దామెర మండలంలో నెలకొన్న పరిస్థితిని ఎంపీడీవో గుమ్మడి కల్పన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఊరుకొండ, పసరగొండ గ్రామాలలో రోడ్డు మార్గాలపై ఉన్న నీటి ప్రవాహాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు."ప్రజలు అధైర్య పడకండి, అండగా మేముంటాం" అని ఆమె స్థానిక ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు పంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల ప్రభుత్వ భవిత సెంటర్‌లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు 'శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలు, ఇతర అవసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమానికి (ట్రైనీ) డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వస్తువులను పంపిణీ చేశారు.మండల విద్యా శాఖ అధికారి ఎస్. రమాదేవి అధ్యక్షతన ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత మాట్లాడుతూ అవసరార్థులకు ఆపన్న హస్తం అందిస్తూ, "మేమున్నామంటూ" ముందుకు సాగుతున్న శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులను ప్రశంసించారు. విద్యార్థులకు పుస్తకాలతో పాటు ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ లాంటి ముఖ్యమైన వస్తువులను అందించడం గొప్ప స్ఫూర్తినిస్తుందని కొనియాడారు. సంస్థ అందించిన సహకారాన్ని స్ఫూర్తిగా తీసుకొని, విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని డిప్యూటీ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లతో పాటు చదువుకోవడానికి అవసరమయ్యే ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పరకాల ఎంఈఓ ఎస్.రమాదేవి, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.సుదర్శన్ రెడ్డి, 'శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హ్యాండ్స్' అధ్యక్షులు నూగూరి చంద్రమోహన్, కోర్ కమిటీ సభ్యులు వి.రమేశ్, యం.శ్రీనివాస్ సురేష్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు సీహెచ్.మధు, సీహెచ్.సురేందర్, రిసోర్స్ పర్సన్ జి.రమాదేవి, సీఆర్పీలు ఏ.రమేశ్ బాబు, జే.శ్రీలత, ఎంఐఎస్ కే. శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అధికారులు అందుబాటులో ఉండాలి

## ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులను అప్రమత్తం చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు రెవెన్యూ, పోలీస్, విద్యుత్ సహా అన్ని కీలక శాఖల అధికారులతో బుధవారంఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలి. లోతట్టు ప్రాంతాల వాసులను అప్రమత్తం చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.ఉప్పొంగే వాగులు, చెరువులు, వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రైతుల పంట నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. సహాయక బృందాలను సిద్ధం చేసి, అవసరమైన ఆహారం, వైద్య సాయం, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలి. అన్ని శాఖల సమన్వయంతో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించి, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎంపీ డాక్టర్ కావ్య ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, చేపలు పట్టడానికి లేదా నీటి ప్రవాహాల వైపు వెళ్లరాదని హెచ్చరించారు. అత్యవసర సహాయార్థం అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని కోరారు.

# వరంగల్ ఎంజీఎంపై చిన్నచూపేలా?



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా రూపుదిద్దుకుంటున్న వరంగల్‌లో నిరుపేదలకు, బడుగు బలహీన వర్గాలకు ఏకైక దిక్కు ఎంజీఎం ఆసుపత్రి. అయితే, గతంలో ఉన్న మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు ప్రస్తుతం కరువయ్యాయని, ఆసుపత్రికి రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొందని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్ల క్రితం వరకు వైద్యులు, నర్సులు, పీజీ విద్యార్థులు సైతం రోగుల పట్ల మర్యాదగా, తృప్తిగా వైద్యం అందించేవారని, కానీ గత కొంతకాలంగా ఆ పరిస్థితి కనిపించడం లేదని రోగులు, వారి సహాయకులు వాపోతున్నారు. గతంలో డాక్టర్ చంద్రశేఖర్ సూపరింటెండెంట్‌గా ఉన్నప్పుడు మెరుగైన సేవలు అందినా, రాజకీయ ఒత్తిళ్ల వల్లనో లేదా ఇతర కారణాల వల్లనో ఆయనను తొలగించడం జరిగిందని పత్రికా ప్రకటనలో ఆరోపణలు వచ్చాయి. ఆ తరువాత జరిగిన దురదృష్టకర సంఘటనలు (ముఖ్యంగా ఇటీవల ఇద్దరు పిల్లలకు జరిగిన సంఘటన) ప్రజలకు తెలుసని, అయినప్పటికీ ప్రభుత్వం, ముఖ్యంగా వైద్య శాఖ మంత్రి దీనిపై సరియైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ఎన్జీఓల తరపున అభిప్రాయం వ్యక్తమైంది. ఆసుపత్రిలో లోపాలు (లొసుగులు) జరుగుతున్నాయని ఆరోపిస్తూ ప్రభుత్వ వైద్యశాలల్లోని లోపాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, కొన్ని ఎన్జీఓలను ఎన్నుకుని వారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలి. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం సరైన విధంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇప్పటికైనా వైద్య శాఖ అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లు కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. వృద్ధులకు వేరే ఓపీ ఉన్నప్పటికీ, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి, చిన్నచూపు చూస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సరైన రూపకల్పన చేసి వృద్ధులతో పాటు అందరికీ మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ ఆడెపు రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు.

# కమలాపూర్‌లో ఐకేపీ కేంద్రాలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలో పలు గ్రామాలలో ఐకేపీ(ఇందిరా క్రాంతి పథం) ధాన్యం కొనుగోలు కేంద్రాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ చేతుల మీదుగా ఈ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. శ్రీరాములపల్లి, మాదన్నపేట, శనిగరం, నేరెళ్ల, పంగిడిపల్లి, మర్రిపల్లిగూడెం, గుండేడు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి రవీందర్ మాట్లాడుతూ... వాయుగుండం కారణంగా ఏర్పడిన "మొంథా తుఫాన్" వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ఐకేపీ ద్వారా చివరి గింజతో సహా కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ధాన్యానికి సంబంధించిన బోనస్‌ను కూడా ప్రభుత్వం సత్వరమే చెల్లిస్తుందని ఆమె ప్రకటించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఐకేపీఅధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, ఐకేపీ ఏపీఎం లలిత, మాజీ సర్పంచ్ గుండపు చరణ్ పటేల్, డైరెక్టర్లు కెత్తే విజయేందర్, చకిలం దయాకర్ యాకూబ్ పాషా, నెగ్గుల లింగయ్య, కాంగ్రెస్ నాయకులు గూడెపు మొగిలయ్య, దూడ శ్రీకాంత్, నాంపల్లి ప్రభాకర ప్రజాపతి, తాటిపాముల రాములు, అబ్బరవేణి అనిల్, బాలపూరి కనకరత్నం, డాక్టర్ విజయేందర్, డాక్టర్ రాజు, సురేందర్రాజు ఉపాసికృష్ణ, ఐకేపీ సిబ్బంది, ఎస్ హెచ్ జీ సభ్యులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో జోరుగా బీజేపీ ప్రచారం

◆ పాల్గొన్న డాక్టర్ వన్నాల వెంకట రమణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాంచందర్ రావు గారితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ నిన్నఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.నిన్న సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు నియోజకవర్గంలోని 60 కేంద్రాలలో ఏకకాలంలో పాదయాత్ర, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా శాస్త్రి నగర్ ప్రాంతంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి లంకెల దీపక్ రెడ్డికి అమూల్యమైన ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఎన్నికల దృష్ట్యా ప్రజలు భారతీయ జనతా పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ రోజు ప్రచారానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే, జూబ్లీహిల్స్‌తో పాటు భవిష్యత్తులో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ సర్కార్ రానున్నదని స్పష్టంగా తెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ముగ్గురు అభ్యర్థులలో బీఆర్ఎస్ అభ్యర్థి సానుభూతితో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ (మునుపటి ఎంఐఎం అభ్యర్థి) ఎంఐఎం పార్టీ మద్దతుతో చీకటి ఒప్పందం చేసుకొని గెలవాలని చూస్తున్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. అసలు పోటీ చేసేది కాంగ్రెస్ అభ్యర్థా, మజ్లిస్ అభ్యర్థా అని ప్రజలే ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇద్దరు ప్రత్యర్థి అభ్యర్థులతో పోల్చుకుంటే, బీజేపీ అభ్యర్థి శ్రీ లంకెల దీపక్ రెడ్డి వివాదరహితుడు, మెరుగైన అభ్యర్థి అని ప్రజలు గ్రహించారని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ శాసనసభ్యులు దాన్ పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు గరికపాటి మోహన్ రావు, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు టార్పాలిన్‌లు అందించాలి

ధాన్యం భద్రతపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:**మొంథా తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైతులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, డీఆర్‌డీఓ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరి ధాన్యం నిల్వలతో పాటు, ఆరబెట్టిన పంట ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులకు తక్షణమే టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలి.తుఫాన్ ప్రభావం తగ్గే వరకు రైతులు వరి కోతలు జరపకుండా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా అధికారులు పర్యవేక్షణ చేయాలి. వెంటవెంటనే ట్రక్ షీట్లు, ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయించాలి.ఒకవేళ ధాన్యం తడిసినా, అది పాడవకుండా ఉండేందుకు వ్యవసాయ అధికారులు సూచించిన పద్ధతులు పాటించాలని రైతులకు తెలియజేయాలి.ప్రజలు తుఫాన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## పరకాల మహా రుద్ర యాగ మహోత్సవం వాయిదా



**వరంగల్ వాయిస్, పరకాల:** తుఫాను తీవ్ర ప్రభావం కారణంగా పరకాలలో నిర్వహించ తలపెట్టిన కార్తిక మాస మహా రుద్ర యాగ మహోత్సవం తాత్కాలికంగా వాయిదా పడింది. నవంబర్ 3, 2025 సోమవారం నిర్వహించాల్సిన ఈ యాగం కోసం ఏర్పాటు చేసిన మండపం, 144 యాగ గుండాలతో సహా తుఫాను కారణంగా కుప్పకూలి, తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసి, కార్తిక మాసంలోనే మరొక రోజున ఘనంగా జరుపుకోవాలని యాగ కమిటీ సభ్యులు నిర్ణయించారు. మహా రుద్ర యాగ కమిటీ సభ్యులు ఎర్రం లక్ష్మన్న, గందె రవి, కొలుగూరి రాజేశ్వరరావు, పావుశెట్టి అనిల్ ఈ విషయాన్ని భక్తులకు తెలియజేశారు.యాగ మహోత్సవం నిర్వహించే కొత్త తేదీని అతి త్వరలోనే ప్రకటిస్తామని, భక్తులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 57వ డివిజన్‌లో ముంచెత్తిన వరద



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్‌లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబేద్కర్ భవన్ రోడ్డు నుంచి గోకుల్ నగర్ 4వ వీధి కాలనీలోకి వరద నీరు ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. దేవిధంగా, టీవీ టవర్ కాలనీ వయా 100 ఫీట్ల రోడ్డు భారీ నీటి ప్రవాహం కారణంగా కోతకు గురైంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని, దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానికులు జీడబ్ల్యూఎంసీ అధికారులను కోరుతున్నారు.

## వరదలో చిక్కుకున్న పిల్లలను స్టేడియానికి తరలించిన స్పోర్ట్స్ ఆఫీసర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీదేవి మాల్ నుంచి హనుమకొండ బస్టాండ్‌కు వెళ్లే దారి పూర్తిగా నీట మునిగింది. దీంతో ఆ ప్రాంతంలో చిక్కుకుపోయిన వారిని గమనించిన హనుమకొండ జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ గుగులోతు అశోక్ కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు.వరద నీటిలో ఇరుక్కుపోయిన పిల్లలను ఆయన సురక్షితంగా బయటకు తీసుకువచ్చి, సమీపంలోని జేఎన్ఎస్ స్టేడియంకు తరలించారు. ఈ కష్ట సమయంలో స్పోర్ట్స్ ఆఫీసర్ అశోక్ కుమార్ చూపించిన చొరవ, సహాయానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


## పవర్‌గ్రిడ్ ఉద్యోగుల వాక్‌థాన్



**వరంగల్ వాయిస్, వరంగల్:** పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పబ్లిక్ గార్డెన్‌లో "విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా సమాజంలో నిజాయితీ, పారదర్శకత, బాధ్యత విలువలను ప్రోత్సహించే లక్ష్యంతో ఒక వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి "జాగరూకత: మన అందరి బాధ్యత" అనే నినాదాన్ని ఇచ్చారు. ఈ వాక్‌థాన్‌లో శ్రీ రాములు (డీజీఎం), కె.సూర్యప్రకాశ్ పవర్‌గ్రిడ్ సంస్థకు చెందిన ఇతర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అవినీతి రహిత, బాధ్యతాయుత సమాజ నిర్మాణానికి తాము అంకితభావంతో పనిచేస్తామని వారు ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం జీవితంలోని అన్ని రంగాలలో నిజాయితీ, నైతిక ప్రవర్తనను పాటించాలనే ప్రతిజ్ఞతో ముగిసింది.

## వరదలో చిక్కుకున్న డీకే నగర్ వాసులు

తాడు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరంగల్ నగరంలోని డీకే నగర్ లోతట్టు ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. వరద నీరు అన్ని గృహాలలోకి చేరడంతో, స్థానికులు ఇళ్లలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే, ఎస్పీ శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు హుటాహుటిన రంగంలోకి దిగారు. సీఐ బొల్లం రమేష్, కార్పొరేటర్ మరుపల్ల రవి, ఆర్ఐ కరుణాకర్, జీపీఓ ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు అత్తర్ తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో, అధికారులు తాడు సహాయంతో స్థానిక ప్రజలను ఒక్కొక్కరిగా సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. చిక్కుకుపోయిన వారిలో పసునూరి రాము, పోలం రంజిత్, వంగరి సురేష్ తదితరులు ఉన్నారు. సురక్షిత ప్రాంతాలకు తీసుకువచ్చిన ప్రజలను సమీపంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు.

# లక్ష్యంతో చదివితేనే విజయం

◆ మోషన్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైనది అని, ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని ఎంచుకుని, క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే జీవితంలో విజయం సాధిస్తారని మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ స్పష్టం చేశారు. హనుమకొండలోని నయీంనగర్ బ్లీస్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం మోషన్ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ... గతంలో వరంగల్ విద్యార్థులు ఐఐటీ, మెడికల్ సీట్ల కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ కాలేజీలకు వెళ్లేవారని గుర్తు చేశారు. ఇప్పుడు దేశంలోనే ఐఐటీ, నీట్ కోచింగ్ కోసం అగ్రగామి సంస్థ అయిన మోషన్ రాజస్థాన్ కోటా బ్రాంచ్‌ను హనుమకొండలో స్థాపించడం జరిగిందని, ఈ అవకాశాన్ని వరంగల్ విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోషన్ కాలేజీ మొదటి బ్యాచ్‌లో మెడిసిన్, ఐఐటీ సీట్లు సాధించిన ఐదుగురు విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు. వారికి మెమంటోతో పాటు, ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున కాలేజీ యాజమాన్యం అందజేసింది. ఈ వేడుకల్లో విద్యార్థులు చేసిన నృత్యాలకు అందరూ కేరింతలు కొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనుజ్ కపూర్, ప్రదీప్ పాఠక్, సురేందర్ సాహు, మిథున్, ఇంటర్ అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, లాండిగ రమేష్, కాలేజీ స్టాఫ్ తాళ్లపెల్లి రమేష్, మండల రాజు, లక్ష్మణ్, శనిగరపు సుమన్, రచ్చ కుమార్, అరుణ, మౌనిక, కడారి అనిల్, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## దిశ మార్చుకున్న
# మెంథా తుఫాన్

- తెలంగాణ వైపు పయనం
- అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ శాఖ హెచ్చరిక.

బంగాళాఖాతంలో ఏర్పడిన మెంతా తుఫాన్ ఊహించని విధంగా తన దిశను మార్చుకుంది. తీరం వైపు దూసుకొస్తున్న క్రమంలో తుఫాన్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలకు ఊరటనిస్తూ, తెలంగాణ వైపు పయనిస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది.తుఫాన్ ప్రస్తుత కేంద్రీకరణతాజా సమాచారం ప్రకారం, మెంథా తుఫాన్ ప్రస్తుతం తెలంగాణ సరిహద్దుల వైపు కదులుతూ క్రింది ప్రాంతాల వద్ద కేంద్రీకృతమై ఉంది. భద్రాచలం నుండి సుమారు 50 కిలోమీటర్లు.ఖమ్మం నుంచి సుమారు 110 కిలోమీటర్లు.తుఫాన్ పయనం తెలంగాణ వైపు మారడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం, విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తమయ్యాయి. వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికతుఫాన్ ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈదురు గాలుల తీవ్రత కూడా అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు."తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా తుఫాన్ కేంద్రీకృతమైన జిల్లాల నివాసులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడంతో పాటు, అధికారులు ఇచ్చే సూచనలను తప్పక పాటించాలి


# వరద గుప్పిట్లో ఓరుగల్లు















వరంగల్ వాయిస్ సినిమా
బుధవారం 29 అక్టోబర్ 2025


# బాహుబలి రిలీజ్‌పై రాజమౌళి ఇంటర్వ్యూ

ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సినిమా మళ్లీ రీ రిలీజ్ కాబోతున్న విషయం తెలిసిందే. 'బాహుబలి: ది ఎపిక్' అనే పేరుతో రెండు భాగాలను ఒకే పార్టుగా అక్టోబర్ 31న రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా రాజమౌళి, ప్రభాస్, రానా స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొని, షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఇందులో ఫస్ట్ పార్ట్‌తో పాటు సెకండ్ పార్ట్‌కి సంబంధించిన విషయాలను పంచుకున్నారు. తాజాగా ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ఫుల్ వీడియోను చిత్రయూనిట్ విడుదల చేసింది.







# మెగా 158లో
## నేను భాగం కావడం లేదు

నటి మాళవికా మోహన్ ప్రకటన విడుదల మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడిరది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' రూపొందుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది విడుదల కానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర' రానుంది. వీటితో పాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు ప్రాజెక్టులు లైనప్‌లో ఉన్నాయి. ఇక మాళవిక 'ది రాజాసాబ్' తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.


# సినిమాల్లోకి స్టార్ వారసురాలు

ఎంట్రీ ఇస్తున్న మహేశ్ బాబు మేనకోడలు జాన్వీ సినిమాల్లోకి మరో స్టార్ వారసురాలు ఎంట్రీకి రంగం సిద్ధమైంది. సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి తొలిసారి హీరోయిన్ రంగ ప్రవేశం చేస్తుంది. సూపర్ స్టార్ మహేశ్ బాబు సోదరి , నిర్మాత మంజుల కూతురు జాన్వీ స్వరూప్ కథానాయికగా తెరపైకి రానున్నట్లు వార్తలు వైరల్ అవుతూ సినీ వర్గాల్లో పెద్ద చర్చగా మారింది. 2010లో సందీప్ కిషన్ హీరోగా మంజుల దర్వకత్వంలో వచ్చిన మనసుకు నచ్చింది సినిమాతో 10 ఏండ్ల వయసులోనే బాలనటిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న జాన్వీ ఆపై తన కెరీర్‌పై దృష్టి పెట్టి ఉన్నత చదువులు పూర్తి చేసి డ్యాన్స్ ఇత్యాది అన్ని రంగాల్లో తర్ఫీదు తీసుకుని మల్టీ టాలెంటెడ్ అని అనిపించుకుంది. అయితే.. సినిమాలలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లుగా తాజాగా చేసిన గ్లామర్ ఫొటో షూట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. జాన్వీ గతంలో మనకు కనిపించిన దానికి విరుద్ధంగా పూర్తిగా ఔట్ అండ్ ఔట్ స్టైల్, లుక్ మార్చి సరికొత్తగా ట్రెండిరగ్ వేర్‌లో వివిధ డ్రెస్సింగ్లతో దర్శణమిచ్చి కృష్ణ, మహేశ్ బాబు అభిమానులను, నెటిజన్లను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. మరోవైపు కృష్ణ కుమారుడు దివంగత రమేశ్ బాబు వారసులు జమకృష్ణ, సైతం హీరో హీరోయున్లుగా వేర్వేరు చిత్రాలతో ఎంట్రీ ఇస్తున్న సమాచారం తెలిసిందే. ఇది ఇలా ఉండగానే ఇప్పుడు జాన్వీ కూడా సిద్ధమవుతుండడంతో కృష్ణ, మహేశ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.



# మాస్ జాతరకు తిరుగులేదు

**□ నటుడు రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యలు వైరల్**



రవితేజ నటించిన మాస్ జాతర సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. అయితే ఆ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమంలో సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రవితేజ హీరోగా నటిస్తున్న 'మాస్ జాతర' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో అన్ని మసాలాలు సరిగ్గా కలిసిన మాస్ సినిమా రాలేదు. థియేటర్‌లో ఈ సినిమాను చూస్తే ఖచ్చితంగా ఆనందంతో తేలిపోతారని అన్నారు. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోతే నేను సినిమాల నుంచి తప్పుకుంటాను అని రాజేంద్ర ప్రసాద్ ఘాటుగా వ్యాఖ్యానించారు. రవితేజతో ఇదే తన మొదటి కాంబినేషన్ అని చెప్పారు. మాస్ జాతర అనే అద్భుతమైన సినిమాను చేయడానికి ఇంత సమయం పట్టింది. దర్శకుడు భాను అద్భుతంగా తెరకెక్కించారు. నా పాత్ర గురించి ఇప్పుడే చెబితే థ్రిల్ పోతుంది , థియేటర్‌లో చూసి ఆనందించండని అన్నారు.



# ది తాజ్ స్టోరీపై
## కేసు దాఖలు

బాలీవుడ్ నటుడు పరేష్ రావల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వివాదాస్పద చిత్రం 'ది తాజ్ స్టోరీ'. ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా విడుదలని అడ్డుకోవాలంటూ ఢల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ చిత్రం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని పిటిషనర్ ఆరోపించారు. అడ్వకేట్ షకీల్ అబ్బాస్ ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా.. ఇందులో ఆయన సెన్సార్ బోర్డు , కేంద్ర ప్రభుత్వం, చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు పరేష్ రావల్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ చిత్రం తాజ్ మహల్ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని తెలిపాడు. అలాగే ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతాన్ని ఈ చిత్రం ప్రోత్సహిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ సినిమా విడుదలైతే మత విద్వేషాలకు దారితీసే అవకాశం ఉందని ఇది దేశ లౌకిక స్ఫూర్తిని దెబ్బతీసుందని అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పిటిషన్‌పై ఢల్లీ హైకోర్టు స్పందిస్తూ.. ఈ పిటిషన్‌ను తక్షణమే విచారించడానికి నిరాకరించింది. ఈ అంశాన్ని సాధారణ విచారణలో భాగంగా పరిశీలిస్తామని కోర్టు స్పష్టం చేసింది.















# సైకిల్ రైడర్స్‌లో జోష్ నింపిన సీపీ

**ఉల్లాసంగా సాగిన ర్యాలీ**

**వరంగల్ వాయిస్, క్రైం:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో నిర్వహించిన సైకిల్ ర్యాలీ అపూర్వ స్పందనతో ఉత్సాహంగా సాగింది. ఈ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్వయంగా పాల్గొనగా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తదితర ఉన్నతాధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వద్ద అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్ పచ్చా జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. సీపీ సన్ ప్రీత్ సింగ్ నేతృత్వంలో ఈ ర్యాలీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్, ఆదాలత్ సెంటర్, హన్మకొండ కలెక్టర్ కార్యాలయం మీదుగా తిరిగి నక్కలగుట్ట వైపుగా ప్రయాణించి పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీ పొడవునా సీపీ రైడర్స్‌తో కలిసి "పోలీస్ అమరవీరులకు జోహార్లు" అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండవచ్చని, ఇది తమ విధుల్లో మరింత మెరుగ్గా రాణించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్ కోసం కొంత సమయం కేటాయించడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని సూచించారు. పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పోలీస్ అమరవీరుల కుటుంబాల తరపున, పోలీసుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, మున్సిపల్ కమిషనర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ మాట్లాడుతూ నిత్యం సైక్లింగ్ చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని, సైక్లింగ్‌ను రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని కోరారు. అనంతరం, సైకిల్ ర్యాలీలో పాల్గొన్న రైడర్లకు పోలీస్ అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాస్, ప్రభాకర్, బాలస్వామి, ఏఎస్పీ శుభం, ఏసీపీలు జితేందర్ రెడ్డి, నర్సింహా రావు, అనంతయ్య, నాగయ్య, సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఏజే పెడల్స్ యాజమాన్యం, ట్రైసిటీ సైకిల్ రైడర్స్, పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిట్ కళాశాల విద్యార్థులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కిన సీఎం

- ఆయన ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించారు.
- సీఎంపై సిరికొండ మధుసూదనా చారి ఫైర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనా చారి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘిస్తూ సీఎం వ్యవహరించారని ఆయన ఆరోపించారు. బుధవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "నిన్న యూసుఫ్‌గూడలో సీఎం రేవంత్ రెడ్డి తెలిసి కావాలని రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఎన్నికల కమిషన్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఆయన వ్యవహరించారు. సీఎం హోదాలో ఉండి, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగుతున్నాయని తెలిసి కూడా, సన్మానం పేరిట యూసుఫ్‌గూడలో దిగజారుడు మాటలు మాట్లాడారు. ఉప ఎన్నిక జరిగే నియోజకవర్గంలోనే యూసుఫ్‌గూడ ఉన్నందున, స్పష్టంగా ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరిగింది" అని మధుసూదనా చారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలవుతుందని సర్వేలు చెబుతున్నందునే, గెలుపు కోసం భారీ సభ ఏర్పాటు చేశారని ఆయన ఆరోపించారు.

**ఈసీ తక్షణ చర్యలు తీసుకోవాలి:**

"ఎలక్షన్ కమిషన్ గౌరవాన్ని, ప్రతిష్టను భంగపరిచే విధంగా నిన్నటి కార్యక్రమం జరిగినందున, ఎలక్షన్ కమిషన్ ఎంక్వయిరీ చేసి సీఎం మీద చర్యలు తీసుకోవాలి," అని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈరోజు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కారని మధుసూదనా చారి విమర్శించారు. ఈ నెల 30, 31, నవంబర్ 4, 5 తేదీల్లో సీఎం అధికారికంగా ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వార్తలు వస్తున్నప్పటికీ, ప్రచారానికి ముందే సభల్లో మాట్లాడి నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించారు. "నిన్నటి కార్యక్రమంలో సినీ కార్మికుల పిల్లల కోసం నర్సరీ నుండి 12వ తరగతి వరకు కార్పొరేట్ విద్యను అందిస్తామని వాగ్దానం చేశారు. అదే విధంగా అధికారులను పిలిచి మూడు, నాలుగు ఎకరాల స్థలాన్ని స్కూల్ కోసం చూడండి అని ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ లాగా చేస్తా అని అన్నారు. ఆయనొక మాటల మనిషి, చేతలు లేవు" అంటూ విమర్శలు గుప్పించారు.

# అండర్ బ్రిడ్జి సమస్యలకు పరిష్కారం

**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ నగరంలో ట్రాఫిక్‌తో నిత్యం రద్దీగా ఉండే అండర్ బ్రిడ్జి క్రింద మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి క్రింద మురుగు నీటి కాలువ శాశ్వత నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ, జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ బుధవారం మంత్రి నివాసంలో ఆమెను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... బ్రిడ్జి క్రింద చాలా సంవత్సరాలుగా మురుగు నీరు ప్రవహిస్తూ, పాదాచారులపైన, వాహన చోదకులపై పడుతూ దుర్గంధం వెదజల్లుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

# విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



☐ దామెర ఏఈ గుర్రం రమేష్

**వరంగల్ వాయిస్, దామెర:** మొంథా తుఫాన్ నేపథ్యంలో దామెర మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున, ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని మండల విద్యుత్ అధికారి, సహాయ ఇంజనీర్ గుర్రం రమేష్ సూచించారు. విద్యుత్ వినియోగదారులకు, రైతులకు ఏఈ ఇచ్చిన ప్రధాన సూచనలు చేశారు. సమస్యలు ఉంటే వెంటనే మీ గ్రామంలోని విద్యుత్ సిబ్బందికి, సబ్ స్టేషన్ నంబర్‌కు లేదా ఏఈకి తెలియజేయగలరు. రైతులు మోటార్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు వహించాలి. తడిచిన చేతులతో విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ తాకకూడదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com